TELANGANA POLITRICKS
www.vishalabharati.com
epaper:vishalabharati.com
పొలిట్రిక్స్
2023-2024
విశాల భారతి
vishalabharathi Telugu Daily
శనివారం, 11.11.2023
హైదరాబాద్
1pm edition

పొలిట్రిక్స్

రిచెస్ట్ ఎమ్మెల్యే అభ్యర్థులు వీళ్లే..

- రూ. 458 కోట్ల ఆస్తులతో రాజగోపాల్‌రెడ్డి టాప్
- రూ. 227 కోట్లతో స్టేట్‌లో సెకండ్‌ప్లేస్
- రూ. 197 కోట్లతో కొత్త ప్రభాకర్‌రెడ్డి థర్డ్

విశాల భారతి, హైదరాబాద్:

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చెందిన కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి అత్యంత ధనవంతుడైన ఎమ్మెల్యే అభ్యర్థిగా రికార్డుల్లోకి కెక్కారు. మునుగోడు నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్‌లో భాగంగా ఆయన తన ఆస్తుల వివరాలను అఫిడవిట్ రూపంలో జత చేశారు. రాజగోపాల్ రెడ్డి మొత్తం ఆస్తుల్లో రూ.297.36 కోట్ల చరాస్తులు ఉన్నాయి. వీటిలో చేతిలో నగదు, బ్యాంకు డిపాజిట్లు, సుషీ ఇన్‌ఫ్రా & మైనింగ్ లిమిటెడ్‌లో రూ.239.31 కోట్ల విలువ కలిగిన షేర్లు ఉన్నాయి. ఆయన భార్య కె.లక్ష్మికి రూ.4.18 కోట్ల చరాస్తులు ఉన్నాయి. రాజ్‌గోపాల్‌రెడ్డికి రూ.108.23 కోట్ల స్థిరాస్తులు ఉండగా, ఆయన భార్యకు రూ.48.60 కోట్ల స్థిరాస్తులు ఉన్నాయి. వీటిలో వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, వాణిజ్య భవనాలు ఉన్నాయి. ఇక అతని పేరుతో మొత్తం అప్పులు రూ.4.14 కోట్లు. అఫిడవిట్ ప్రకారం, 2022 23లో అతని ఆదాయం రూ. 71.17 కోట్లు, 2021 22లో రూ. 1.52 కోట్లుగా ఉంది. రాజ్‌గోపాల్ రెడ్డి అఫిడవిట్‌లో రాష్ట్ర ప్రభుత్వాలు, సింగరేణి కాలరీస్, సెంట్రల్ కోల్‌ఫీల్డ్స్ , ఇతర రాష్ట్రాల నుండి సుషీ ఇన్‌ఫ్రా, మైనింగ్ లిమిటెడ్ పేరుతో పొందిన 16 కాంట్రాక్టుల వివరాలను కూడా సమర్పించారు. 2018లో మునుగోడు నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నప్పుడు రూ. 314 కోట్ల ఆస్తులను ప్రకటించినప్పటి నుంచి ఆయన నికర విలువ 45 శాతానికి పైగా పెరిగింది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న సమయంలో రూ. 66 కోట్ల ఆస్తులు ప్రకటించారు. 2009 నుంచి 2014 వరకు లోక్‌సభ సభ్యుడిగా ఉన్న రాజ్‌గోపాల్ రెడ్డి 2018లో కాంగ్రెస్ టిక్కెట్‌పై మునుగోడు నుండి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. అనంతరం మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో, ఆయన కాంగ్రెస్‌ను విడిచిపెట్టి, అసెంబ్లీకి రాజీనామా చేసి, గత సంవత్సరం బీజేపీలో చేరారు. అయితే గతేడాది నవంబర్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో ఆయన ఓడిపోయారు. కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సోదరుడైన రాజ్‌గోపాల్‌రెడ్డి కొద్దిరోజుల క్రితం మళ్లీ కాంగ్రెస్‌లో చేరి మునుగోడుకు టికెట్ దక్కించుకున్నారు. ఇదిలావుంటే, అధికార పార్టీ బీఆర్ఎస్‌కు చెందిన పైళ్ల శేఖర్ రెడ్డి రాష్ట్రంలోనే అత్యంత ధనవంతుడిగా రెండో స్థానంలో నిలిచారు. భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తిరిగి బరిలోకి దిగిన ఆయన ఆస్తులు విలువ రూ.227 కోట్లు. శేఖర్ రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. మరోక ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి, మెదక్ ఎంపీ దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కె.ప్రభాకర్ రెడ్డితో భాగస్వాములుగా ఉన్నారు.

ఇక దుబ్బాక నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన ప్రభాకర్ రెడ్డి ఆస్తులు రూ.197 కోట్లు. ఇటీవల కత్తిపోట్లతో కోలుకున్న ఆయన గురువారం తన నామినేషన్ పత్రాలను దాఖలు చేసేందుకు వీల్ చైర్‌లో రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వచ్చారు. ఆయనకు రూ.7.24 కోట్ల చరాస్తులు ఉండగా, ఆయన భార్య మంజులతకు రూ.9.41 కోట్ల చరాస్తులు ఉన్నాయి. ప్రభాకర్ రెడ్డికి రూ.84.63 కోట్ల స్థిరాస్తులు ఉండగా, ఆయన భార్య విలువ రూ.96 కోట్లు. 2022 23లో, అతని ఆదాయం రూ. 2.91 కోట్లు కాగా, అంతకుముందు సంవత్సరంలో ఇది రూ. 3.16 కోట్లు. ఈ జంట మొత్తం రూ.12.79 కోట్ల రుణాలను కలిగి ఉన్నారు. నాగర్‌కర్నూల్ నుంచి పోటీ చేస్తున్న జనార్దన్‌రెడ్డి తన ఆస్తులు రూ.112 కోట్లుగా ప్రకటించారు.

ఎస్సీ వర్గీకరణపై ప్రధాని కీలక ప్రకటన?

- నేడు మాదిగల విశ్వరూప సభకు మోడీ రాక
- వారం వ్యవధిలోనే హైదరాబాద్‌కు రెండోసారి..
- తెలంగాణ బీజేపీ శ్రేణుల్లో ఫుల్‌జోష్

విశాల భారతి, స్టేట్‌బ్యూరో:

భారత ప్రధాని నరేంద్ర మోడీ ఇవాళ మరోసారి తెలంగాణ రాష్ట్రానికి రానున్నారు. ఎన్నికల వేళ వారం రోజులు తిరక్కుండానే ప్రధాని మోదీ రెండోసారి హైదరాబాద్‌కు వస్తుండడంతో బీజేపీ శ్రేణుల్లో జోష్ పెరిగింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన బీజేపీ బీసీ ఆత్మీయ సభలో మోడీ పాల్గొన్నారు. ఇవాళ మాత్రం మాదిగ విశ్వరూప సభకు హాజరవుతున్నారు.మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే మాదిగ, మాదిగ ఉపకులాల విశ్వరూప మహాసభకు ముఖ్య అతిథిగా ప్రధాన మంత్రి హాజరుకానున్నారు. సాయంత్రం 4 గంటల 45 నిమిషాలకు ప్రధాని మోడీ బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో నేరుగా పరేడ్ గ్రౌండ్‌కు వెళతారు. సాయంత్రం 5 గంటల నుంచి 5 గంటల 45 నిమిషాల వరకు పరేడ్ గ్రౌండ్ లో జరిగే సభలో పాల్గొంటారు. సభ అనంతరం సాయంత్రం 6 గంటలకు ప్రధాని మోదీ తిరిగి ఢిల్లీ వెళ్లనున్నారు. సభకు భారీ సంఖ్యలో తరలివచ్చి సక్సెస్‌చేయాలని మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు.

తాము అధికారంలోకి వస్తే ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన బీజేపీ పదేండ్లుగా అధికారంలో ఉన్నా ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదు. దీనిపై మాదిగ సామాజిక వర్గం తీవ్ర ఆగ్రహంతో ఉంది. దీంతో ఎన్నికల సమయంలో అత్యధిక ఓట్లు కలిగిన మాదిగ సామాజిక వర్గాన్ని మచ్చిక చేసుకునే పనిలో పడింది బీజేపీ. ఇప్పటికే టికెట్ల కేటాయింపులో ఆ సామాజిక వర్గానికి ప్రాధాన్యత నిచ్చింది. తెలంగాణలో 19 రిజర్వ్‌డ్ స్థానాలతో పాటు అదనంగా రెండు జనరల్ స్థానాల్లోనూ ఎస్సీలకు అవకాశం కల్పించింది. అందులో మాదిగ సామాజిక వర్గానికి 14 అసెంబ్లీ స్థానాలు కేటాయించారు. మాల సామాజిక వర్గానికి ఏడు అసెంబ్లీ స్థానాలు కేటాయించారు. మాదిగ విశ్వరూప సభలో ఎస్సీ వర్గీకరణపై ప్రధాని కీలక ప్రకటన చేసే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

హీటెక్కిన మునుగోడు!

- బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య త్రిముఖ పోరు
- అనూహ్యంగా బీజేపీ నుంచి బరిలో చలమల్ల క్రిష్ణారెడ్డి
- బీఆర్ఎస్ తరఫున సిట్టింగ్ ప్రభాకర్‌రెడ్డి పోటీ
- కాంగ్రెస్‌నుంచి 'ప్యారాచూట్ రాజగోపాల్ రెడ్డి'
- రాజగోపాల్‌వైఖరిపై మునుగోడు జనం అసహనం
- బైఎలక్షన్‌తర్వాత బీఆర్ఎస్ పై పెరిగిన అసంతృప్తి
- చాపకింద నీరులా విస్తరిస్తున్న బీజేపీ

విశాల భారతి, స్టేట్‌బ్యూరో:

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ మరోసారి మునుగోడు రాజకీయాలు ఆసక్తిని రేపుతున్నాయి. ప్రధాన పార్టీల నుంచి అభ్యర్థులు బరిలో నిలవడంతో.. ఎవరు గెలిచి నిలుస్తారన్న చర్చ జోరుగా సాగుతోంది. విజయం సాధించేందుకు బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య త్రిముఖ పోరు జరుగుతుంది. మునుగోడు బైఎలక్షన్‌లో ఓటమి తర్వాత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బీజేపీలో యాక్టివ్ రాజకీయా కార్యకలాపాలకు దూరంగా ఉన్నారు. 'కాంగ్రెస్‌పార్టీ చచ్చిపోయింది రా నాయనా' అంటూ కమలం గూటికి చేరి బైఎలక్షన్ లో నిలిచిన రాజగోపాల్‌రెడ్డి మళ్లీ కాంగ్రెస్ తరఫున ప్యారాచూట్ వేసుకుని బరిలో నిలిచారు. ఉప ఎన్నికల్లో సర్వశక్తులు ఒడ్డి గెలిచిన బీఆర్ఎస్ లో సిట్టింగ్ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డినే మళ్లీ రంగంలోకి దిగారు. రాజగోపాల్‌రెడ్డి దగాతో 'హస్తం' జెండాను అక్కున చేర్చుకుని బలమైన శక్తిగా తీర్చి దిద్దిన చలమల కృష్ణారెడ్డికి ఆఖరి నిమిషంలో 'హస్తం' పార్టీ హ్యాండ్ ఇవ్వడంతో ఏ మాత్రం తగ్గకుండా అనూహ్యంగా బీజేపీ అభ్యర్థిగా రంగంలోకి దిగారు.

గతంలో కాంగ్రెస్, సీపీఐ హవా

నియోజకవర్గం ఏర్పాటైన తర్వాత రెండు ఉప ఎన్నికలు సహా ఇప్పటి వరకు 17 సార్లు జరిగిన ఎన్నికల్లో .. కాంగ్రెస్, సీపీఐ పార్టీలే గెలిచాయి. 1952 ఎన్నికల్లో పీడీఎఫ్ సహా సీపీఐ ఇక్కడి నుంచి ఏడు సార్లు గెలిచింది. మరో ఎనిమిది పర్యాయాలు కాంగ్రెస్ విజయం సాధించగా ఒక ఉప ఎన్నిక సహా బీఆర్ఎస్ రెండు విజయాలు దక్కించుకుంది. ఈ గణాంకాలను పరిగణలోకి తీసుకునే తమకు పట్టున్న నియోకవర్గంగా అటు సీపీఐ, ఇటు కాంగ్రెస్ భావిస్తున్నాయి. ఈ సారి ఇరు పార్టీల మధ్య పొత్తు కుదరడంతో కాంగ్రెస్ అభ్యర్థిగా మద్దతుగా నిలుస్తున్నారు. మరో పక్క సీపీఎం తన అభ్యర్థిని పోటీలో నిలపడం కాస్తా కలవరం రేపుతోంది. సీపీఎంకు కూడా ఈ నియోజవకర్గంలో కనీసం పది వేల ఓట్లు సాధించేంత బలం ఉండటం గమనార్హం.

బీఆర్ఎస్ కు ఘోర అవమానం

గతేడాది ఆగస్టులో కాంగ్రెస్‌కు చెందిన కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి ఆకస్మికంగా అసెంబ్లీ సభ్యత్వానికి రాజీనామా చేసి బీజేపీలోకి వెళ్లారు. దీంతో ఉప ఎన్నికల అనివార్యమైంది. కాంగ్రెస్ నుంచి టీఆర్ఎస్‌లోకి వెళ్లే సంకేతాలను చూపిన రెడ్డి ఓట్లను తమవైపు తిప్పుకునేందుకు అన్ని వర్గాల ఆత్మీయ ప్రయత్నాల వల్ల వాటాలు మరింత పెరిగాయి. నియోజక వర్గ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న రాజ్‌గోపాల్ నిష్క్రమణతో బీఆర్ఎస్, బీజేపీలు ఆ ఎన్నికల్లో నువ్వా.. నేనా అన్నట్లుగా పోరాడాయి. రాజ్‌గోపాల్ వర్సెస్ ప్రభత్వంగా ఆ ఎన్నికలు మారాయి. ఊరుకో అధికార పార్టీ ఎమ్మెల్యే మకాం వేసి వందల కోట్ల రూపాయలను ఖర్చు పెట్టినా. అత్తెసరు మెజారిటీతో గట్టెక్కడం తప్ప బీఆర్ఎస్ సాధించేందేమీ లేదు. పైగా ఆ ఎన్నికల్లో పక్కనున్న కమ్యూనిస్టులు.. కేసీఆర్ నమ్మక ద్రోహం కారణంగా ఈ సారి కాంగ్రెస్ కు మద్దతుగా నిలిచారు. అయితే ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ఇంటిపోరుతో సతమతమవుతోంది. ఇప్పటికే పార్టీలోని ముగ్గురు కీలక నాయకులు బీసీ నినాదంతో ఇక్కడి నుంచి టికెట్ ఆశించి, ఆ కల నెరవేరక తీవ్ర నిరాశలో ఉన్నారు. ఇపుడు వారంతా తమ అభ్యర్థికి మనస్ఫూర్తిగా సహకరిస్తారన్న గ్యారెంటీ కనిపించడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

చాపకింద నీరులా విస్తరిస్తున్న చలమల్ల క్రిష్ణారెడ్డి

ఇక మునుగోడు ఉప ఎన్నికల సమయంలోనే నియోజకవర్గానికి ఆల్టర్నేట్‌కాంగ్రెస్‌నాయకుడిగా అవతరించిన చలమల్ల క్రిష్ణారెడ్డి పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డికి దగ్గరి అనుచరుడిగా పేరు తెచ్చుకున్నారు. బై ఎలక్షన్‌లోనే ఆయన టికెట్ ఆశించినా.. నల్లగొండ కాంగ్రెస్ రాజకీయాల్లో వేలు పెట్టలేని నిస్సహాయ స్థితిలో ఇక్కడి కోమటిరెడ్డి లాంటి సీనియర్ల మాటకు తలొగ్గిన రేవంత్ రెడ్డి పాల్వాయి స్రవంతిని పోటీకి దింపారు. అయితే ఆ సమయంలో వచ్చే జనరల్ ఎలక్షన్స్‌లో చలమల్ల క్రిష్ణారెడ్డికి టికెట్ ఇస్తామని రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్‌హైకమాండ్ హామీ ఇచ్చినట్లు చెబుతున్నారు. దీంతో బై ఎలక్షన్‌ముగిసిన నాటి నుంచే క్రిష్ణారెడ్డి నియోజకవర్గంలో 'హస్తం' పార్టీ మూలాల నుంచే తనదైన శైలిలో తన వ్యక్తిగత చరిష్మాతో క్యాడర్‌ను డెవలప్‌చేసుకున్నారు. ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసనలు, ఆందోళన కార్యక్రమాలు, పాదయాత్రలు చేపట్టారు. కానీ, తీరా టికెట్‌కన్ఫామ్‌అయిన తర్వాత రాజగోపాల్ రెడ్డి పార్టీలోకి రావడం, టికెట్ దక్కించుకోవడం చకచకా జరిగిపోయాయి. దీంతో తీవ్ర ఆవేదన చెందిన చలమల్ల ఏమాత్రం తగ్గకుండా.. ఆయన నిర్మాణం చేసిన క్యాడర్‌ను నిరుత్సాహపరచకుండా.. తగ్గేదేలేదంటూ బీజేపీలోకి వెళ్లి టికెట్ తెచ్చుకొని పోటీలో నిలబడ్డారు. స్థానిక యువనేత అయిన చలమల్ల వెంటే కాంగ్రెస్‌క్యాడర్‌కూడా పూర్తిస్థాయిలో బీజేపీలోకి వచ్చింది. దీంతో బీజేపీ నేతలు, క్యాడర్‌ను కూడా చలమల్ల కూడా చక్కగా సమన్వయం చేసుకుంటూ చాపకింద నీరులా విస్తరిస్తూ గెలుపు బాటలు వేసుకుంటున్నారు. గురువారం ఆయన నామినేషన్ కార్యక్రమం కూడా భారీ జనవాహిని మధ్య ఎంతో అట్టహాసంగా జరిగింది. కేంద్ర యువజన సర్వీసుల శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ సింగ్ తో కలసి ఆయన నామినేషన్‌వేశారు. అనంతరం చండూరులో నిర్వహించిన భారీ బహిరంగ సభలో 'గెలుపు మనదే.. కష్టపడుదాం.. విజయం సాధిద్దాం' అని పిలుపునిచ్చారు. దగా చేసిన నాన్‌లోకల్‌గాళ్లను మునుగోడు పాలిమేరల నుంచి తరిమికొడదామని పిలుపునిచ్చారు.

బలపడిన బీజేపీ..

2022 డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపులో బీఆర్ఎస్ అభ్యర్థి ప్రభాకర్ రెడ్డి కూసుకుంట్ల విజయం సాధించారు. ఆయనకు 97,006 ఓట్లు వచ్చాయి. బీజేపీ తరఫున కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి 86, 697 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ అభ్యర్థి కేవలం 10,309 ఓట్లతో గెలుపొందారు. అదే సమయంలో కాంగ్రెస్ అభ్యర్థి పాల్వాయి స్రవంతికి 23,906 ఓట్లు రావడం గమనార్హం. అయితే అప్పుడు రాజగోపాల్ వెంట కాంగ్రెస్‌నుంచి బీజేపీ లో చేరిన క్యాడర్‌ప్రస్తుతం ఆయన వెంట నడిచేందుకు సిద్ధంగా లేనట్లు తెలుస్తోంది. ఏదో ఇద్దరు, ముగ్గురు నాయకుల మినహా క్యాడర్ చలమల్ల వెంటే నడుస్తోంది. దీంతో బీజేపీ నియోజకవర్గంలో ఏ మాత్రం తగ్గకుండా ముందుకు సాగుతోంది.

మహిళలే కీలక నిర్ణేతలు

నల్గొండ జిల్లా లోని 12 అసెంబ్లీ నియోజకవర్గాలలో మునుగోడు విభిన్నమైనది. 2007లో చేసిన నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ ప్రకారం ఈ నియోజకవర్గంలో 6 మండలాలు ఉండగా గత బైఎలక్షన్‌టైమ్ లో గట్టుప్పల్ మండలంగా ప్రకటిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో 7 మండలాలుగా కొనసాగుతోంది. చౌటుప్పల్, నారాయణపురం, మునుగోడు, నాంపల్లి, చండూరు, మర్రిగూడ, గట్టుప్పల్. మునుగోడు నియోజకవర్గంలో 2022 ఉప ఎన్నిక నాటికీ మొత్తం 2,41,855 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1,21,720 మంది పురుషులు, 1,20,128 మంది మహిళా ఓటర్లు ఉన్నారు.

సమస్యలతో జనం వలసబాట

మునుగోడు నియోజకవర్గానికి 2014 కంటే ముందు పదిసార్లు ఎన్నికలు జరిగాయి. ఐదుసార్లు కాంగ్రెస్, ఐదుసార్లు కమ్యూనిస్టులు విజయం సాధించారు. మునుగోడు అనేక సమస్యలకు కేంద్రంగా ఉండేది. భూగర్భ జలాలు అడుగంటిన ఈ నియోజకవర్గం ప్రపంచంలో అత్యంత ఎక్కువ ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతంగా గుర్తింపు ఉంది. లక్షలాది మంది ప్రజలు ఫ్లోరైడ్ పీడితులుగా మారిపోయారు. కాళ్లు, నడుములు వంకరపోయి, పండ్లు గారలు పట్టి దివ్యాంగులుగా మారారు. సాగునీరు లేక, వర్షాలు పడక, పంటలు పండక భూములన్నీ పడావు పడ్డాయి. ప్రతి గ్రామం నుంచి హైదరాబాద్, ముంబయికి జనం వలస పోయారు. అయితే, 2014లో టీఆర్ఎస్, 2018లో కాంగ్రెస్, 2022 ఉప ఎన్నికల్లో మళ్లీ టీఆర్ఎస్‌కు ఇక్కడి ప్రజలు మద్దతుగా నిలిచారు.

ముగ్గురిదీ ఒకే మండలం

మునుగోడు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే పదవికి పోటీ చేస్తున్న బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం అభ్యర్థులు ముగ్గురిదీ సంస్థాన్ నారాయణపురం మండలంలోని సర్వేల్‌రెవెన్యూ విలేజ్‌కావడం విశేషం. బీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిది లింగమోనిగూడెం. బీజేపీ అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డిది మల్లారెడ్డిగూడెం. సీపీఎం అభ్యర్థి దోనూరి నర్సిరెడ్డిది నాగమోనిగూడెం. ఈ 3 గ్రామాలూ సర్వేలు రెవెన్యూ పరిధిలోనే ఉన్నాయి. ఈ నియోజకవర్గం నుంచి నామినేషన్లు దాఖలు చేసిన బీఎస్పీ, ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థులది కూడా సంస్థాన్ నారాయణపురం మండలమే. బీఎస్పీ అభ్యర్థి అందోజు శంకరాచారి జనగాం గ్రామానికి చెందినవారు. ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థి ఏర్పుల గాలయ్యది పుట్టపాక గ్రామం.

గులాబీ బాస్ యూటర్న్!

- 'హస్తం' హవాకు ఉక్కిరి బిక్కిరి
- అభివృద్ధి, పథకాలపై నెగెటివ్ రెస్పాన్స్
- 'మేడిగడ్డ'తో కాళేశ్వరం కథ చెప్పలేని పరిస్థితి
- స్కీమ్స్‌గురించి చెప్పలేక అభ్యర్థుల హైరానా
- హ్యాట్రిక్ అందుకునేందుకు సారు న్యూ స్ట్రాటజీ
- తెలంగాణ సెంటిమెంట్ వాడాలని ఆదేశాలు
- ఉద్యమ విషయాలనే ప్రస్తావిస్తున్న కేసీఆర్
- 'కారు' పార్టీకి 'గ్యారేజీ' పక్కా అని టాక్..

విశాల భారతి, స్టేట్‌బ్యూరో:

తొమ్మిదిన్నరేండ్ల పాలనలో సాధించిన ప్రగతి గురించి అటు సీఎం కేసీఆర్, ఇటు బీఆర్ఎస్ లీడర్లు ఎక్కడా గొప్పగా చెప్పుకోవడం లేదు. చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తుంటే ప్రజలను నుంచి పాజిటివ్ కంటే.. నెగెటివ్ రెస్పాన్స్ ఎక్కువగా వస్తోందనే భయం వారిని పట్టుకుంది. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్ కుంగిపోయిన తరువాత కాళేశ్వరం ప్రాజెక్టు గురించి అసలు ఊసెత్తడం లేదు. దళిత బంధు, బీసీలకు లక్ష సాయం, గృహలక్ష్మి పథకాల గురించి గొప్పగా చెప్పుకుందామంటే, ప్రజల నుంచి డబ్బులు ఎప్పుడిస్తారనే ప్రశ్నలు వస్తున్నాయని నేతలు హైరానా పడుతున్నారు. ఇలాంటి పరిస్థితిలో భావోద్వేగాన్ని తెరపైకి తెచ్చి, సెంటిమెంటును మరింత పెంచి మరోసారి అధికారంలోకి వచ్చేందుకు బీఆర్ఎస్ న్యూ స్ట్రాటజీతో ముందుకెళ్తున్నట్లు టాక్ వినిపిస్తోంది.

మారిన ప్రచార వ్యూహం

ఎన్నికల ప్రచారంలో అభివృద్ధి, సంక్షేమ మంత్రం పనిచేయడం లేదని బీఆర్ఎస్ లీడర్లు బలంగా నమ్ముతున్నారు. ఈ క్రమంలో ప్రజలను చేరవయ్యేందుకు తెలంగాణ సెంటిమెంట్‌ను ఉపయోగించాలనే నిర్ణయానికి వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. అందులో భాగాంగానే పాల్గొంటున్న ప్రతి సభలో చేసిన పనులు, చేయబోయే పనుల కంటే ముందు సీఎం కేసీఆర్ తెలంగాణ ఉద్యమ విషయాలను ఎక్కువగా ప్రస్తావిస్తున్నారు. ఇటీవల కాంగ్రెస్‌కు అనుకూల పవనాలు వీస్తున్నాయనే ప్రచారం కూడా జోరుగా జరుగుతోంది. దీంతో గులాబీ బాస్ యూ టర్న్ తీసుకొని, మళ్లీ ఉద్యమ సెంటిమెంట్ ను రగిల్చే ప్రయత్నం చేస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఎక్కడికక్కడ ఉద్యమ నేతలను దగ్గరకు తీస్తూ.. ప్రచారంలో వారికి ప్రాధాన్యం కల్పించాలని నేతలను ఆదేశించినట్లు తెలుస్తోంది.

కాంగ్రెస్‌ను అడ్డుకోవాలని..

తెలంగాణ ప్రజల్లో కాంగ్రెస్ పట్ల సానుకూల పవనాలు వీయడం కూడా కారు పార్టీకి మింగుడు పడటం లేదు. తొమ్మిదేండ్ల పాలనలో అనేక అవినీతి ఆరోపణలు, ప్రజలకు సీఎం దూరం కావడం కూడా ఇసారి ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు ఇచ్చే అవకాశం ఉంది. దీంతో గులాబీ బాస్ దిద్దుబాటు చర్యలు తీసుకుంటున్నారని తెలుస్తోంది. ఇలాంటి సమయంలో కాంగ్రెస్‌ను అడ్డుకోవాలంటే అభివృద్ధి, సంక్షేమ మంత్రం ఒక్కటే పనిచేయదని గుర్తించి.. మధ్యేమార్గంగా ఉద్యమ సెంటిమెంట్ ను తట్టిలేపేందుకు యత్నిస్తున్నారు.

తొమ్మిదేండ్లవుతున్నా.. విమర్శలేనా?

ప్రజలను ఆకట్టుకోవాలంటే భావోద్వేగం అవసరమని బీఆర్ఎస్ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. అందుకే కేసీఆర్ పబ్లిక్ మీటింగ్‌స్‌లో తొలి, మలి దశ ఉద్యమ సమయాల్లో కాంగ్రెస్ ఏం చేసిందో వివరిస్తూ ఆ పార్టీపై విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును కాంగ్రెస్ అడ్డుకున్నదని, బీఆర్ఎస్ పోరాడి సాధించిందనే సంకేతాలను ప్రజల్లోకి పంపేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే, వీటిని ప్రజలు పెద్దగా పట్టించుకోవడం లేదు. ఈసారి ఎలాగైనా తెలంగాణ ఇచ్చిన సోనియమ్మకు అధికారం అప్పగించేందుకు తెలంగాణ సమాజం సిద్ధమైంది. కాంగ్రెస్ నేతల ప్రచారానికి వస్తున్న స్పందన చూస్తే.. ఈసారి ఎన్నికల్లో కారు పార్టీకి గ్యారేజీ పక్కా అన్న సంకేతాలు కనిపిస్తున్నట్లు పొలిటికల్ అనలిస్టులు అభిప్రాయబడుతున్నారు.